సాక్షి
జనగామ
బుధవారం । 20 । మార్చి । 2024



అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన

కాకతీయ యూనివర్సిటీలో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు మంగళవారం క్యాంపస్‌లోని రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆందోళనకు దిగారు.

- 8లో



సరిహద్దుల్లో రెడ్ అలర్ట్!

తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని గడ్చిరోలి జిల్లాలో పోలీసు-మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మృతి చెందారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
34.0^0 /21.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంటుంది.

ఇఫ్తార్	సహర్
బుధ 6:33	గురు 4:58

రంజాన్ వేళలు

‘గాలికుంటు’తో అప్రమత్తం

జిల్లాలో వ్యాధి నిరోధక టీకా స్పెషల్ డ్రైవ్

- 23 బృందాలు, 1.35 లక్షల జీవాలు
- కోల్డ్ స్టోరేజీలో టీకా డోస్‌లు
- ఉచిత టీకాను సద్వినియోగం చేసుకోవాలి
- పశుసంవర్ధకశాఖ వైద్యుడు మనోహర్



టీకాలు వేస్తున్న వైద్యులు, పర్యవేక్షిస్తున్న డీవీఏహెచ్‌ఓ మనోహర్

జనగామ: జీవాలకు వచ్చే గాలికుంటు వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధి నివారణకు పశు సంవర్ధక శాఖ వైద్యుల సలహాలు తీసుకుంటూ.. క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమతో ఆర్థికంగా బలపడుతున్న రైతులు నష్ట పోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి సంవత్సరం రెండుసార్లు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు ఈ టీకాలను వేస్తున్నారు. జిల్లాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్‌ఎల్ మనోహర్ నేతృత్వంలో సహాయ సంచాలకులు డాక్టర్ నర్సయ్య ఆధ్వర్యంలో తెల్ల, నల్ల పశువులకు (ఆవులు, గేదెలు) వైద్యులు, వైద్య సిబ్బంది టీకాలు వేస్తున్నారు. గ్రామాల్లో ముందస్తు టాంటాం వేస్తూ రైతులను అప్రమత్తం చేస్తున్నారు. మండలాల వారీగా పశువుల సంఖ్యను లెక్క వేసిన పశు సంవర్ధక శాఖ.. అందుకు తగ్గట్టుగా బృందాలను ఏర్పాటు చేశారు. 1.35 లక్షల టీకా డోస్‌లు జిల్లాకు చేరుకోగా, కోల్డ్ స్టోరేజీలో భద్ర పరిచారు. గ్రామాల వారీగా షెడ్యూల్ ప్రకారం ప్రతీరోజు ఉదయం 6 గంటల నుంచి చల్లదనాన్ని బట్టి ఉదయం 11 గంటల వరకు పశువులకు టీకాలు వేస్తున్నారు. పశువులు ఉన్న ప్రతి రైతు ఉచిత టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా పశు సంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వ్యాధి సోకిన పశువుల నుంచి ఇతర పశువులకు గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది.

గాలికుంటు వ్యాధి లక్షణాలు

గాలికుంటు వ్యాధి సూక్ష్మక్రిములతో వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన గేదెలు, ఆవులు 24 గంటల లోపు బక్కచిక్కి పోయి, అల్సర్ బారిన పడతాయి. రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వరం ఎక్కువగా ఉంటుంది. నోరు, పెదాలు, నాలుక, చన్నులతో పాటు కాళ్ల గిట్టల మధ్య పుండ్లు వచ్చి అనతికాలంలోనే వ్యాధి ముదిరి పోతుంది. ఈ వ్యాధి సోకిన పశువులు ఎప్పుడు ముడుచుకుని పడుకుంటాయి. మేత, నీళ్లు సరిగా తీసు కోవు. వ్యాధి నిరోధక శక్తి తగ్గి పశువులు, దూడలు చనిపోయే ప్రమాదం ఉంటుంది.

జిల్లా వివరాలు	
తెల్ల, నల్ల పశువులు	1.35 లక్షలు
బృందాలు	23
డాక్టర్లు	18
కంపౌండర్లు	45
గోపాలమిత్రలు	30
పశు మిత్రలు	29

వ్యాధి చికిత్స

వ్యాధి సోకిన పశువులకు ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించాలి. నోరు, పెదాలు, నాలుక, కాళ్ల గిట్టల వద్ద ఉన్న పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ లేదా నార్మల్ సెలైన్ వాటర్‌తో శుభ్రం చేయాలి. రెండోసారి ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండడానికి యాంటీ బయాటిక్స్ మందులు, పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి బీ కాంప్లెక్స్ మందులను వాడాలి.


టీకాలు శ్రీరామ రక్ష

పశువులకు గాలి ద్వారా సోకే గాలికుంటు వ్యాధిపై నిర్లక్ష్యం వహించకుండా పశు సంవర్ధక శాఖ వైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా ఏడాదికి రెండు సార్లు టీకాలు వేయించాలి. గాలికుంటు ప్రాణాంతకమైన వ్యాధి కావడంతో చిన్న పాటి అలసత్వం చేసినా, పశువు మృతి చెందే ప్రమాదం ఉంటుంది.

వ్యాధి సోకిన పశువులకు..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులను ఇతర మూగ జీవితాలతో కలిసి ఒకే చోట ఉంచకూడదు. ఎప్పటికప్పుడు పశువుల పాకను శుభ్రంగా ఉంచాలి. వారానికి ఒకసారి కొట్టంలో సున్నం చల్లి, క్రిమికీటకాల నివారణకు చర్యలు తీసుకోవాలి. వ్యాధి సోకిన గేదె, ఆవు నుంచి తీసిన పాలను 100 డిగ్రీల సెల్సియస్ వరకు వేడి చేసిన తర్వాతనే తాగాలి. వ్యాధి సోకి పశువు చనిపోతే దానిని గోతిలో వేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి పాతిపెట్టాలి.

టీకాలను సద్వినియోగం చేసుకోవాలి



పశువుల్లో సోకే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను ప్రతి రైతు వేయించాలి. వ్యాధి సోకకుండా ముందస్తుగా వేసే ఉచిత టీకాలు వేయించడంతో పాటు అప్పటికే వ్యాధితో బాధపడుతున్న వాటిని వెంటనే వెటర్నిటీ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స మొదలు పెట్టాలి. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు టీకా కార్యక్రమం కొనసాగుతుంది. గ్రామాల వారీగా టీకాలు వేసే సమయంలో ఒక్కరోజు ముందుగానే టాంటాం వేయిస్తున్నాం.

- డాక్టర్ ఎస్ఎల్ మనోహర్,
డీవీఏహెచ్‌ఓ, జనగామ

అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

జనగామ: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బ్యాంకుల్లో అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మర్ పింకేశ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ జిల్లాస్థాయిలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.50 వేల నుంచి రూ.10 లక్షల లోపు జరిగే ప్రతీలావాదేవికి రశీదు ఉండాలన్నారు. రూ.10 లక్షల పైన లావాదేవీలు జరిగితే ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందన్నారు. బ్యాంకు లాకర్స్‌లో బంగారం ఎంత ఉందనే దానిపై పూర్తి డాటా తయారు చేసి, క్యాష్ జనరేట్ చేయడానికి క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించాలన్నారు. రోజువారీగా నగదు డిపాజిట్ వివరాలను నమోదు చేయాలని బ్యాంకర్లను కోరారు.

రాజకీయ పార్టీలతో..

ఎంపీ ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్ నియమ, నిబంధనలపై పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాలను ఉల్లంఘిస్తే సీ-విజిల్ యాప్‌లో రిపోర్టు చేయాలన్నారు. పబ్లిక్ అండ్ ప్రైవేట్ స్థలాల్లో నిర్వహించే సమావేశాలు, గోడలపై రాతలు, ఫ్లెక్సీలు, లౌడ్ స్పీకర్లు తదితర అంశాలపై సువిధ పోర్టల్‌లో అనుమతి పొందిన తర్వాతనే నిర్వహణ చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 15 వరకు ఫాం 6 లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం జిల్లాలోని ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఎలక్షన్ పోస్టర్లు, కరపత్రాలు, ఫ్లెక్సీలపై పేరు, అడ్రస్ లేకుండా ప్రింట్ చేయకూడదన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, నాయకులు, బ్యాంకర్లు, ప్రింటర్ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి కృషి చేయాలి

జనగామ రూరల్: అంగన్‌వాడీల్లో ఉన్న పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోషణ పక్వాడ్ పోస్టర్‌ను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, అధికారులతో ఆవిష్కరించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి తగు విధంగా అవగాహన కల్పించి పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా పోషణ్ ప్రతిజ్ఞ చేశారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

జనగామ: ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉపాధి హామీకి సంబంధించి అన్ని మండలాలతో పాటు జిల్లా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం హాలులో మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి ఎంపీడీఓలు, ఎంపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు సగటున రూ.2 వందల కూలీ గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. స్వచ్ఛతలో జిల్లాను స్టేట్‌లో మొదటి స్థానంలో నిలిచేలా పని చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో ఐహెచ్‌హెచ్‌ఎల్ కింద పెండింగ్‌లో ఉన్న 1,127 టాయిలెట్స్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో 96 శాతం ఇంటి నల్లా పన్నులు వసూళ్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. ఈ నెల 24 వరకు 100 శాతం వసూళ్లు లక్ష్యం చేరుకోవాలని సూచించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ తరగతి నుంచి ముగ్గురు తల్లులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో ఉంటారని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు రూ. 25 వేల వరకు టెండర్లు లేకుండా సంఘాల తీర్మానం మేరకు ఖర్చు చేసుకోవచ్చని, రూ. 25 వేల నుంచి రూ.లక్ష వరకు ఎంపీడీఓల ఆమోదించవచ్చని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీపీఓ రంగాచారి, జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, డీడబ్ల్యూఓ జయంతి, డీఆర్‌డీఓ మొగులప్ప, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రెండో రోజు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు



జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా 41 సెంటర్లలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన సెకండ్ లాంగ్వేజ్ ఇంగ్లిష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. 6,698 మంది విద్యార్థులకు గాను 6,692 మంది హాజరయ్యారని (99.91 శాతం) డీఈఓ రాము తెలిపారు. పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ ఏ, బీ సెంటర్లు, ధర్మకంచ పాఠశాలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తనిఖీ చేశారు. స్టేట్ అబ్జర్వర్ విజయ లక్ష్మి భాయి పట్టణంలోని సోషల్ వెల్ఫేర్‌తో పాటు సెయింట్ మేరీస్ పాఠశాలలను సందర్శించారు. డీఈఓ రాము 8 సెంటర్లను సందర్శించి తగు సూచనలను చేశారు. సెంయిట్ పాల్స్ స్కూల్‌ను డీసీపీ సీతారాం, ఏసీపీ దామోదర్‌రెడ్డి సందర్శించారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

జనగామ రూరల్: ఈనెల 28న జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు చీఫ్ ఎలక్షన్ అధికారి శ్రీరాం శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కమిటీలో అధ్యక్షకార్యదర్శులతో పాటు 7 మంది కమిటీ సభ్యులకు కామన్ బైలా ప్రకారం ఎన్నిక ఉంటుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులు నేడు (బుధవారం) నామినేషన్ వేయాలన్నారు. 21న స్క్రూటినీ, 22న విత్‌డ్రా, ఫైనల్ లిస్ట్, 28న కోర్టు ఆవరణలో పోలింగ్ ఉంటుందన్నారు.

టీవీయూఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా పృథ్వీరెడ్డి



దేవరుప్పుల: తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సమాఖ్య (టీవీయూఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా సింగరాజుపల్లికి చెందిన ఇప్ప పృథ్వీరెడ్డి ఎన్నికైనట్టు ఆ విభాగం రాష్ట్ర అడహక్ కమిటీ ప్రతినిధి పిడమర్తి రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పృథ్వీరెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులకు సముచిత న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

యువతిపై అత్యాచారం

లింగాలఘణపురం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై యువకుడు ఇంట్లో ఎవరు లేని సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎస్సై చింత రాజు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం సందెపల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి సిద్దారెడ్డి ఐదు నెలల నుంచి తన అక్క ఇంట్లో ఉంటూ జీడికల్‌లోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం కిరాణ షాపుకు వెళ్లిన యువకుడు అక్కడ ఎవరు లేకపోవడంతో షాపులో ఉన్న యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి తల్లిదండ్రులు పనులకు వెళ్లి తిరిగి ఇంటికి రాగానే జరిగిన విషయం తెలిపింది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

- ఇద్దరికి గాయాలు

చిల్పూరు: మండలంలోని తీగలతండా గ్రామ పంచాయతీ పరిధిలోని వాచ్యతండా సమీపంలో చిన్నపెండ్యాల-తరిగొప్పుల రోడ్డులో మంగళవారం రాత్రి ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని వడ్డెగూడెంకు చెందిన బొమ్మిశెట్టి ఎల్లయ్య చిన్న పెండ్యాల గ్రామంలో పని ఉండగా ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. చిన్నపెండ్యాల నుంచి చిల్పూరుగుట్టకు ద్విచక్రవాహనంపై ఒర్సు సాంబరాజుతో పాటు అతని భార్య సరస్వతి వస్తున్నారు. ఇదే మండలం తీగలతండా పంచాయతీ పరిధిలోని వాచ్యతండా వద్ద ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నా యి. దీంతో వెనుకాల కూర్చున్న సరస్వతి ఎగిరి పడడంతో గాయాలు కాగా మరో వాహనంపై ఉన్న ఎల్లయ్య ఎగిరి పడడంతో తలకు తీవ్రంగా గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలియగానే కానిస్టేబుల్ వీరన్న సంఘటన స్థలానికి చేరుకుని 108లో సమాచారం ఇవ్వగా పైలట్ హరికృష్ణ గాయపడిన వారిని ఎంజీఎంకు తీసుకెళ్లాడు.

ఎన్నికలకు పారా మిలటరీ బలగాలు

- ర్యాలీలు, డీజే, సమావేశాలకు అనుమతి తప్పనిసరి
- జిల్లాలో ఆరు చెక్ పోస్టులు
- డీసీపీ పి.సీతారాం



పెంబర్తి చెక్ పోస్టు వద్ద పోలీసులు

జనగామ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో స్థానిక పోలీసులతో పాటు పారా మిలటరీ బలగాల పర్యవేక్షణలో బందోబస్తు ఉంటుందని డీసీపీ పి.సీతారాం తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా పరిధిలో వరంగల్, మహబూబాబాద్, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఒక కంపెనీ (70 మంది) పారా మిలటరీ బలగాలు జిల్లాకు చేరుగా, మరో రెండు రానున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, నిషేధిత వస్తువులపై నిఘా ఉంచేందుకు వరంగల్-హైదరాబాద్ రూట్ పెంబర్తి, బచ్చన్నపేట మండలం కొన్నె, మొండ్రాయి, రాయపర్తి, జఫర్‌గఢ్, తరిగొప్పులలో ఆరు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాజకీయ పార్టీలు డీజే, ర్యాలీలు, సమావేశాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, లేదంటే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. బెల్ట్ దుకాణాల నిర్వహణపై నిరంతరం తనిఖీలు ఉంటాయని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. సోషల్ మీడియాపై నిఘా పెంచామని, ఎవరైనా కాంట్రవర్షన్ పోస్టులను పోస్టు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న వరుణ్‌రెడ్డి

రఘునాథపల్లి: ఎండల తీవ్రత నేపథ్యంలో పంటలపై ప్రభావం పడకుండా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. మండలంలోని ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. లా బుక్, రికార్డులను పరిశీలించి, విద్యుత్ సరఫరాలో సమస్యలున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలుగొద్దని సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఆయన వెంట ఎస్‌ఈ టి. వేణుమాధవ్, డీఈ లక్ష్మినారాయణరెడ్డి, ఏడీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా, సమస్యలు తదితర అంశాలను అక్కడి అధికారులు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎస్‌ఈ వేణుమాధవ్, డీఈలు ఎం.హుస్సేన్‌నాయక్, వి.విజయ్‌కుమార్, ఏడీఈ జి.సత్యనారాయణ, ఏఈ చంద్రమోహన్, లైన్ ఇన్స్పెక్టర్ నీలం ఐలేష్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

దేవరుప్పుల: గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలతోపాటు అపరిష్కృత సమస్యలు పరిష్కరించుకుంటే ఆందోళన అనివార్యమని గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జీపీ కార్మికులు సమస్యలపై బస్వ రామచంద్రు ఆధ్వర్యంలో ధర్నా చేసి మండల అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బందిపై ప్రభుత్వ జాప్యం తగదన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమిస్తూ, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్, ఎన్నికల మేనిఫెస్టో హామీలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బస్వ రామచంద్రు, కోశాధికారి ఎడవెల్లి వెంకట్‌రెడ్డి, సభ్యులు ఉప్పుల ఐలయ్య, బొందుగుల రమేశ్, చింత రామ్ చందర్, చింత అశోక్, జోగు ఉప్పలయ్య, చిందేటి పరుషరాములు, సాట్ల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

వంట.. మంట

- అందని వంట బిల్లులు
- 5 నెలల నుంచి ఎదురుచూపులు
- కష్టాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు
- జిల్లాలో 1,091 మంది..
- 508 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)

జనగామ రూరల్: చాలీచాలని వేతనాలతో వంట సరుకులు కొనుగోలు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికుల కష్టాలు తీరడం లేదు. మధ్యాహ్న కార్మికులకు గౌరవ వేతనంతో పాటు 5 నెలలుగా భోజన బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడుగా అల్పాహారం భారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమ సమస్యలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. జిల్లాలో 508 పాఠశాలలు ఉండగా 1,091 మంది కార్మికులు పని చేస్తున్నారు.

పెరిగిన గుడ్డు ధర

ప్రభుత్వం తమకు రూ.5లతో చెల్లిస్తుండగా మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 వరకు ఉంటుంది. అప్పులు తెచ్చి వంట చేస్తున్నామని, బిల్లులు మాత్రం సకాలంలో రావడం లేదని, ఇలా అయితే తమ కుటుంబాలు గడిచేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 ఉండగా ప్రభుత్వం మాత్రం రూ.5 చెల్లిస్తున్నారు. ప్రతీ గుడ్డుపైన రూ.2వరకు లాస్ అవుతుందని చెబుతున్నారు. పైగా పప్పు, చింతపండు, కారం, నూనె, వంట గ్యాస్ ధర కూడా విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం చెల్లించే డబ్బులు సరిపోవడం లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న పని భారం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం అల్పాహారాన్ని అందించాలని నిర్ణయించింది. ఆయా పాఠశాలలకు ఉదయం ఇడ్లీ, పూరీ, వడ తదితర టిఫిన్స్ అందజేస్తున్నారు. అయితే విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట తయారీ భారం అవుతుందని ఏజెన్సీ నిర్వాహకులు తెలుపుతున్నారు. తమకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఇటీవల అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అయితే ప్రభుత్వం మహిళా సంఘాలకు వంట బాధ్యతలు అందజేస్తామనడం సరికాదని, అప్పులు తెచ్చి సేవ చేస్తున్న తమను గుర్తించకపోవడం బాధాకరమని, ఏజెన్సీలను కాదని సంఘాలకు ఇస్తే ఉద్యమిస్తామని అంటున్నారు.

జిల్లాలో పాఠశాలల వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు:	341
ప్రాథమికోన్నత పాఠశాలలు:	63
ఉన్నత పాఠశాలలు:	104
మొత్తం పాఠశాలలు:	508
విద్యార్థుల సంఖ్య:	35,905
మధ్యాహ్న భోజన కార్మికులు:	1,091

ప్రభుత్వం చెల్లించే ధర (రూపాయల్లో..)
1 నుంచి 5వ తరగతి వరకు : రూ.5.17
6 నుంచి 8వ తరగతి వరకు : రూ. 8.17
9, 10 తరగతులకు :10.67 (గుడ్డు కలుపుకొని)

బిల్లు సరిపోవడం లేదు..



ప్రభుత్వం అందించే బిల్లు సరిపోవడం లేదు. ధరలు పెరగడంతో పెట్టుబడి ఎక్కువగా అవుతుంది. పైగా సకాలంలో బిల్లులు రాకపోవడంతో అప్పులు తెచ్చి వంట చేస్తున్నాం. వెంటనే బిల్లు చెల్లించి ఆదుకోవాలి.

-ఎండీ ఖలీదా బేగం,
యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

గుడ్డు ధర పెంచాలి



ప్రభుత్వం గుడ్డు ధర రూ.5 మాత్రమే చెల్లిస్తుంది. మార్కెట్‌లో రూ.6 నుంచి రూ.7 వరకు ఉంది. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. తక్షణమే గుడ్డు ధర పెంచి ఇవ్వాలి. అలాగే ఏజెన్సీలను యథావిధిగా కొనసాగించాలి.

- వేముల నర్సింగం,
మధ్యాహ్న భోజన సంఘం గౌరవ అధ్యక్షుడు

పరిశోధన పత్రం సమర్పణ



కేయూ క్యాంపస్: న్యూఢిల్లీ జేఎన్‌యూలో నిర్వహిస్తున్న 8వ వరల్డ్ కేన్సర్ కాంగ్రెస్‌లో మంగళవారం కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, సైకాలజిస్ట్ గజ్జల రామేశ్వరం పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ‘కేన్సర్‌కు ప్రకృతి వైద్య చికిత్స పద్ధతుల ద్వారా రెండు శతాబ్దాల చారిత్రక ఆధారాల సాక్ష్యాలు’ అంశంపై రామేశ్వరం తన పరిశోధన పత్రం సమర్పించారు. అనంతరం నిర్వాహకులు ఆచార్య రామేశ్వరాన్ని సన్మానించి సర్టిఫికెట్ అందజేశారు.

కేయూ ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్.రాధిక తెలిపారు. ఈనెల 22, 26, 28 తేదీల్లో ఈపరీక్షలు జరుగుతాయన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సమస్యలను గుర్తించాలి

- పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్‌ఓ రోహిత్ సింగ్



మాట్లాడుతున్న ఏఆర్‌ఓ రోహిత్ సింగ్

పాలకుర్తి టౌన్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్‌ఓ, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ హాల్‌లో ఎన్నిక నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజవర్గంలో పోలింగ్ కేంద్రాలను సందర్శించిన నివేదికను అధికారులు అందజేశారు. ఈ సందర్భగా ఏఆర్‌ఓ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలను ఉన్న సెక్టర్ అధికారులు గుర్తించాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు తీరందాస్ వెంకటేశం, సీహెచ్ అంజయ్య, హుస్సేన్, శ్రీనివాస్, మహేందర్, వినోద్‌కుమర్, ఎన్నికల డీటీ రామారావు, సెక్టార్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తితో ఇళ్ల స్థలాలు సాధించుకోవాలి



మాట్లాడుతున్న ఇర్రి అహల్య

బచ్చన్నపేట: ఇళ్లు లేని నిరుపేదలు పోరాటాల స్ఫూర్తితో ఇళ్ల స్థలాలు సాధించుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గోపాల్‌నగర్ గ్రామంలో భూ పోరాట కేంద్రంలో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి సభను మండల నాయకురాలు చంద్రకళ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న వారికి అధికారికంగా పట్టాలను ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చీర రజిత, కొండ వరలక్ష్మి, శోభ, బుచ్చమ్మ, పద్మ, పుష్ప, లక్ష్మి, మల్లమ్మ, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నిట్ విద్యార్థి మృతి

● హైదరాబాద్ తార్నాకలో ఘటన



క్షితిజ్‌రాజ్ (ఫైల్)

కాజీపేట అర్బన్ : హైదరాబాద్ తార్నాకలోని వైజంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిట్ వరంగల్‌కు చెందిన విద్యార్థి క్షితిజ్‌రాజ్(22) మృతి చెందాడు. నిట్ వరంగల్ యాజమాన్యం కథనం ప్రకారం.. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఇంటర్వ్యూ నిమిత్తం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు క్షితిజ్ రాజ్, అర్జున్ తల్వార్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌కు చెందిన హర్షిత్ మహేశ్వరీ, మెటలర్జీకి చెందిన నవీన్ దావన్, కపిల్ సోమవారం ఉదయం హనుమకొండలో ఓ కారును అద్దెకు తీసుకుని హైదరాబాద్ బయలుదేరారు. ఇంటర్వ్యూ అనంతరం తిరుగు ప్రయాణంలో అదేరోజు రాత్రి తార్నాక వై జంక్షన్ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో కారు అతి వేగంగా యూటర్న్ చేస్తుండగా డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఎడమ వైపున కూర్చున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన క్షితిజ్‌రాజ్ అక్కడికక్కడే మృతి చెందగా మిగతా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తార్నాక పోలీసులు తెలిపారు.

మైలారంలో వృద్ధుడు..

రాయపర్తి: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని మైలారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ములుగు జిల్లా జాకారం గ్రామానికి చెందిన వల్లెపు ఉప్పలయ్య (70) ఎల్లమ్మపండుగ నిమిత్తం మైలారంలో నివసిస్తున్న తన కుమారుడి వద్దకు వచ్చాడు. పండుగ అనంతరం ఇంటికి వెళ్లడానికి వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై కాలినడకన బస్టాండ్ వైపునకు బయలుదేరాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సరిహద్దుల్లో రెడ్ అలర్ట్!

గడ్చిరోలి జిల్లాలో నలుగురు మావోయిస్టు అగ్రనేతల ఎన్‌కౌంటర్

● పోలీసు–మావోయిస్టుల ఎదురుకాల్పుల్లో మృతి
● కాళేశ్వరం వద్ద భద్రత కట్టుదిట్టం చేస్తున్న జిల్లా పోలీసులు
● మావోలు గోదావరి దాటకుండా కట్టడి..
● నదీ పరీవాహక ప్రాంతాల్లో కూంబింగ్ మరూ..



బీరాసాగర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్సైలు

కాళేశ్వరం : తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని గడ్చిరోలి జిల్లాలో పోలీసు–మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మృతి చెందారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ వైపు నుంచి మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోకి మావోయిస్టులు తరలి వెళ్లారు. దీంతో పక్కా సమాచారంతో మంగళవారం తెల్లవారుజామున గడ్చిరోలి సీ–60 పోలీసు బలగాలు.. రేపన్‌పల్లి సమీపంలో కోలమార్క గుట్టపై తలదాచుకున్న మావోయిస్టుల జాడ కనుగొన్నారు. పోలీసుల కదలికల సమాచారం తెలియడంతో మావోలు కాల్పులు జరపగా పోలీసులు ప్రతిదాడికి పాల్పడ్డారు. దీంతో నలుగురు మావోయిస్టులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంగి ఇంద్రవెల్లి ఏరియా కమిటీ కార్యదర్శి, కొమురంభీం, మంచిర్యాల జిల్లా ఏరియా డీవీసీఎం వర్గీస్(28), సిర్పూర్, చెన్నూర్ ఏరియా కమిటీ కార్యదర్శి పొడియం పాండు అలియాస్ మంగ్తు(32), ప్లాటూన్ దళసభ్యులు కర్సంగ రాజు, కుడిమెట్ట వెంకటేష్ మృతి చెందారు. వారి వద్ద తుపాకులు, విప్లవసాహిత్య పుస్తకాలు, సామగ్రి లభ్యమయ్యాయి. వీరిపై రూ. 36 లక్షల రివార్డు ఉందని అక్కడి పోలీసులు తెలిపారు.

సరిహద్దుల్లో తనిఖీలు..

ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్రలో పోలీసులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. రెండు రాష్ట్రాలోని గోదావరి నది తీరాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో కూంబింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భూపాలపల్లి జిల్లా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. రాత్రి, పగలు గోదావరి తీరప్రాంతాలు, అడవులను జల్లెడ పడుతున్నారు. పల్లెలతోపాటు ప్రాజెక్టుల ప్రాంతాల్లో అనుమానితులు కనిపిస్తే విచారించి వదిలేస్తున్నారు. దీంతో గోదావరి తీర ప్రాంతాల్లో హైఅలర్ట్ నెలకొంది. కాళేశ్వరం అంతర్రాష్ట వంతెన గుండా మహారాష్ట్ర, తెలంగాణకు రాకపోకలు సాగించే వాహనాలపై దృష్టిసారించారు. కాళేశ్వరం, మహదేవపూర్, పలిమెల ఎస్సైలు భవానిసేన్, ప్రసాద్, తమాషారెడ్డి.. వేర్వేరుగా ఆయా మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించారు. మహదేవపూర్, పలిమెల మండలాల్లోని అడవుల్లో నిరంతరం కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారు తెలంగాణ వైపునగల మహదేవపూర్, పలిమెల మండలాల్లో గోదావరి నదిదాటి జిల్లాలోకి ప్రవేశించకుండా భూపాలపల్లి జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు.

గ్రామాల్లోకి వస్తే...

కాళేశ్వరం అంతర్రాష్ట వంతెన సమీపంలోని బీరాసాగర్ గిరిజన గ్రామంలో సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్సై భవానిసేన్ మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. కొత్త వ్యక్తుల సమాచారం ఇవ్వాలని, ఎవరికీ ఆశ్రయం కల్పించొద్దని, అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

భద్రత కట్టుదిట్టం..

భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో గోదావరి, ప్రాణహిత, ఇంద్రావతి నదీతీరాల్లో సీఆర్పీఎఫ్, డిస్ట్రిక్ట్ గార్డ్స్, సివిల్ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిఘా కట్టుదిట్టం చేశారు. మృతి చెందినవారు మావోయిస్టు అగ్రనేతలు కావడంతో ప్రతిదాడులకు పాల్పడతారనే ఉద్దేశంతో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఎన్‌కౌంటర్ ఘటనతో రెండు రాష్ట్రాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

వీసీలతో న్యాక్ అధికారుల సమావేశం



సమావేశంలో వీసీ రమేష్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఇతర ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్(న్యాక్) ఉన్నతాధికారులు దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల వీసీలు, జాతీయ సంస్థల డైరెక్టర్లు, అటానమస్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో న్యాక్ అక్రిడిటేషన్ విధానం, ప్రస్తుతం ఉన్న విధానంలో వచ్చే మార్పులు, చేపడుతున్న విధానం పరమైన నిర్ణయాలు,అక్రిడిటేషన్ పొందిన విద్యాసంస్థలకు వచ్చే ప్రయోజనాలతో పాటు విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారని సమాచారం. డిజిటలైజేషన్, అకడమిక్ క్రెడిట్లు, ఫిర్యాదు , పరిష్కార యంత్రాంగం, అభిప్రాయసేకరణ, విద్యాసంస్థల్లో ఉన్న ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్‌ల పనితీరు, దీని కోసం నిర్ణయించిన బెంచ్ మార్కు ,అప్‌గ్రేడ్ కావడానికి దృష్టిపెట్టాల్సిన అంశాలు చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ఆచార్య కృష్ణమాచార్య, ఐక్యూఏసీడైరెక్టర్ ఆచార్య నర్సింహాచారి, రిటైర్డ్ ఆచార్యుడు ఎన్‌గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు వెళ్తుండగా ప్రమాదం

● కల్వర్టును ఢీకొన్న బైక్
● పదో తరగతి విద్యార్థినికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన అక్షయ

కాటారం: ఏడాది పాటు కష్టపడి చదివి చివరి పరీక్షలకు హాజరవుతున్న వేళ ఆ విద్యార్థిని కలలు రోడ్డు ప్రమాదం రూపంలో చెదిరిపోయాయి. మొదటి రోజు పరీక్ష బాగా రాసిన సంతోషంలో రెట్టింపు ఉత్సాహంతో రెండో రోజు పరీక్షకు వెళ్తూ ఓ పదో తరగతి విద్యార్థిని ప్రమాదానికి గురై తీవ్రగాయాపాలైంది. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బయ్యారం క్రాస్ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపల్లికి చెందిన తోటపల్లి శ్రీలత, ప్రవీణ్ దంపతుల కూతురు అక్షయ కాటారం జడ్పీహెచ్ఎస్ పరీక్షా కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాస్తోంది. మంగళవారం హిందీ పరీక్షకు హాజరయ్యేందుకు అన్న రాజేశ్, తమ్ముడు తరుణ్‌తో కలిసి బైక్‌పై పరీక్షా కేంద్రానికి బయలుదేరింది. మార్గ మధ్యలో బయ్యారం క్రాస్ సమీపంలో బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. దీంతో బైక్ వెనుక కూర్చున్న అక్షయ ఎగిరి రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. రాజేశ్, తరుణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో భూపాలపల్లికి తరలించారు. అక్షయ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్‌కు తరలించినట్లు తెలిసింది.

'సైబర్' వలలో పడొద్దు

● మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి

రామన్నపేట : సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దని వరంగల్ మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి సూచించారు. మట్టెవాడకు చెందిన యాద కౌశిక్ అపరిచిత మెసేజ్‌కు స్పందించి రూ. 2.32 లక్షలు సమర్పించుకున్నాడు. ఈ ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పార్ట్ టైం జాబ్ కల్పిస్తామని 6265480243 నంబర్ నుంచి ఈ నెల 14వ తేదీన కౌశిక్ సెల్‌కు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. దీంతో కౌశిక్ తనకు వద్దని మెసేజ్ పెట్టాడు. తరువాతి రోజు నుంచి ఇలాంటి మెసేజ్‌లు వస్తుండగా స్పందించాడు. వారు చెప్పిన విధంగా గూగుల్ మ్యాప్ ఓపెన్‌చేసి గ్రాండ్ హియత్ ముంబాయి హోటల్ రెసిడెన్సీకి రేటింగ్ ఇస్తే అకౌంట్‌లో డబ్బు చేస్తామని చెప్పారు. దీంతో కౌశిక్ రేటింగ్ ఇవ్వగా అతడి అకౌంట్‌లో కొంత డబ్బు క్రెడిట్ చేశారు. తరువాత తెలంగాణ లింక్‌లో జాయిన్ అవ్వమని చెప్పి అందులో రేటింగ్ ఇచ్చి స్క్రీన్ షాట్ పంపిస్తే రూ. 50 క్రెడిట్ చేస్తామనగా బాధితుడు అలా 10 నుంచి 12 సార్లు రేటింగ్ ఇచ్చాడు. ఈ క్రమంలో 15వ తేదీన మరికొన్ని మెసేజ్‌లు పంపిస్తూ రూ. 2 పెట్టుబడి పెడితే రూ.2800 ఇస్తామని, రూ.29 వేలు చేస్తే రూ.48 వేలు అని, ఇలా రూ.50 వేలు చెల్లించిన తరువాత డబ్బు మీకు తిరిగి రావాలంటే రూ. 30 వేలు ఇవ్వాలని చెప్పారు. ఇలా బాధితుడి నుంచి మొత్తం రూ. 2, 32, 000 వసూలు చేశారు. ఈ క్రమంలో డిపాజిట్ చేసిన డబ్బులు తిరిగి రాకపోవడంతో కౌశిక్ మట్టెవాడ పోలీసులను సంప్రదించినట్లు సీఐ గోపి తెలిపారు. అపరిచిత సందేశాలకు స్పందించి ప్రజలు తమ డబ్బును కోల్పోవద్దని సీఐ సూచించారు.



అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన

● రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదం



రిజిస్ట్రార్‌తో వాగ్వాదం చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు మంగళవారం క్యాంపస్‌లోని రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆందోళనకు దిగారు. తమ నియామక ప్రక్రియ ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండగా, తమను ఉద్యోగాల నుంచి తొలగించడానికి యత్నిస్తున్నారని ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు.. రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. వివిధ విభాగాలకు చెందిన ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లలో కొందరు కొంతకాలం క్రితం తమకు పదోన్నతులు కల్పించాలని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మంగళవారం హైకోర్టులో పలువురి అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులకు సంబంధించిన కేసు వ్యవహారంలో వాదనల సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించేది లేదని పేర్కొన్నారన్నారు. ఒక యూనివర్సిటీ న్యాయవాది.. యూనివర్సిటీ అసిస్టెంట్‌ప్రొఫెసర్లకు ఎలా వ్యతిరేకంగా వాదిస్తారని తమ ఆందోళన వ్యక్తం చేస్తూ రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. దీనిపై రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ తమకు ఈవిషయం తెలియదని తెలియదన్నారు. హైకోర్టులో ఏ వాదించారో కూడా తెలియదన్నారు. అనంతరం సంబంధిత యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదితో ఫోన్‌లో మాట్లాడగా హైకోర్టులో తాను ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లను తొలగిస్తారని చెప్పలేదని అన్నారని రిజిస్ట్రార్.. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తెలిపారు. అయితే హైకోర్టులో ఆ కేసుకు సంబంధించిన వాదనలు ఆన్‌లైన్‌లో ప్రసారమవుతున్న నేపథ్యంలో కోర్టు వాదనలకు సంబంధించి పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు రికార్డు చేసి రిజిస్ట్రార్‌కు వినిపించారని సమాచారం. యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా మరో సీనియర్ అడ్వకేట్‌ను నియమించాలని డిమాండ్‌చేస్తూ ఆందోళనను రాత్రి 9 గంటల వరకు కొనసాగించారు.

రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేత

అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళనకు అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) మాజీ జనరల్‌సెక్రటరీ డాక్టర్ ఇస్తారి మద్దతు తెలిపారు. ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు ఇవ్వకుండా మానసిక వేదనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అనంతరం యూనివర్సిటీ నిర్ణయానికి వ్యతిరేకంగా స్టాండింగ్ కౌన్సిల్ హైకోర్టులో వాదనను వినిపించినందుకుగాను ఆ న్యాయవాది స్థానంలో సీనియర్ కౌన్సిల్‌ను(న్యాయవాది) నియమించి తమకు న్యాయం చేయాలని రిజిస్ట్రార్ మల్లారెడ్డికి అసిస్టెంట్ ప్రొఫెసర్లు..అకుట్ మాజీ జనరల్ సెక్రటరీ ఇస్తారితో కలిసి వినతిపత్రం సమర్పించారు.

స్పృహతప్పిన అసిస్టెంట్ ప్రొఫెసర్

అసిస్టెంట్ ప్రొఫెసర్లు రిజిస్ట్రార్‌తో మాట్లాడుతున్న సందర్భంగా కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్ కొద్దిసేపు స్పృహ తప్పి అస్వస్థతకు గురయ్యారు. దీంతో మిగతా అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆందోళనకు గురయ్యారు. కొంత సమయం తరువాత తేరుకున్నారు.

ప్రచారాస్త్రం.. సోషల్ మీడియా



వరంగల్ పార్లమెంట్ స్థానంలో ఆన్‌లైన్ ప్రచారం షురూ..

● అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావం చూపడంతో ఇప్పటి నుంచే స్పీడ్.
● నియోజకవర్గాల వారీగా బృందాల ఏర్పాటు
● పరిస్థితులకు అనుగుణంగా పార్టీ వాయిస్ వినిపించేలా వ్యూహాలు
● విమర్శలు, ప్రతివిమర్శలతో ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం
● ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా ప్రచారం
● కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఖరారు కాకున్నా ఆయా పార్టీల ప్రచార పర్వం

సాక్షి, వరంగల్: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో పొలిటికల్ హీట్ పెరిగింది. కొద్ది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరి అధికార, ప్రతిపక్షాలన్నీ ఇప్పటి నుంచే సోషల్ మీడియా ప్రచారాస్త్రాన్ని వినియోగించుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య ఖరారు కావడంతో ఆ పార్టీ శ్రేణులు తమ అభ్యర్థినిని గెలిపించుకునేందుకు ఆన్‌లైన్ ప్రచార మాధ్యమాలను విరివిగా వినియోగిస్తున్నాయి. అధికార పార్టీ కాంగ్రెస్‌తో పాటు బీజేపీ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఇదే సమయంలో బీజేపీ కూడా విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. తమ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించకున్నా దేశంలో మళ్లీ రాబోయేది మోదీ ప్రభుత్వమేనని, తెలంగాణ అభివృద్ధిలో దూసుకెళ్లాలంటే ఇక్కడి అభ్యర్థిని గెలిపించాలంటూ ఆ పార్టీ కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇంకా అభ్యర్థి విషయంలో స్పష్టతకు రాకపోవడంతో శ్రేణుల్లో అయోమయం నెలకొంది. అయినా ఆశావహులు ఎవరికివారు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచార స్పీడ్ పెంచారు. మరికొద్ది రోజుల్లో అభ్యర్థి విషయంలో స్పష్టత రాగానే ఈ ప్రచారం మరింత వేగం పెరుగుతుందని ఆ పార్టీ కార్యకర్తలు అంటున్నారు.

ఇప్పటికే రంగంలోకి సోషల్ మీడియా బృందాలు

వరంగల్ పార్లమెంట్ పరిధిలోని స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి నియోజకవర్గాల్లో సోషల్ మీడియా బృందాలు ఇప్పటికే తమ పార్టీ వాయిస్‌ను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా పనిచేస్తున్నాయి. మే 13న పోలింగ్ ఉండడంతో ఇప్పటినుంచే అన్ని అస్త్రశస్త్రలతో జనాలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే ఆన్‌లైన్ వేదికగా అభ్యర్థులు కాకుండా పార్టీలే లక్ష్యంగా విమర్శలు, ప్రతివిమర్శలు సాగుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై ధర్నాలు చేసిన నాయకులు, కార్యకర్తలు సామాజిక మాధ్యమాల వేదికగానూ బీజేపీ, కాంగ్రెస్‌పై ఫైర్ అవుతున్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామరక్ష అని, కావాలనే బీఆర్ఎస్ ముఖ్య నేతలను ఇరుపార్టీలు టార్గెట్ చేస్తూ గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయంటున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీజేపీలో చేరగా, బీఆర్ఎస్ ఎంపీ పసనూరి దయాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయాన్ని ఉదాహరిస్తూ ఆ రెండు పార్టీలు ఎన్ని కుట్రలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్యదే విజయమని అంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్, బీజేపీ కూడా ఎలాగైనా వరంగల్‌లో విజయం సాధించేలా సోషల్ మీడియాను వేదికగా వినియోగించుకుంటున్నాయి. ఇందుకోసం అన్ని పార్టీలు ఏకంగా సోషల్ మీడియా విభాగాలను ఏర్పాటు చేసుకొని ముందుకు సాగుతున్నాయి. విమర్శలు, ప్రతివిమర్శల దాటిని పెంచుతున్నారు. మే 13న పోలింగ్ నాటికి ఈ ప్రచారం పర్వం మరింత దూకుడు కనిపించనుంది. 'మా పార్టీ ప్రతి కార్యక్రమంతో పాటు ఎందుకు గెలిపించాలనే విషయాలను ఆన్‌లైన్ వీడియోలతో పాటు వాట్సాప్, ఫేస్ బుక్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగామ్‌ల్లో పోస్టు చేస్తున్నాం. జనాలకు అన్ని క్షుణ్ణంగా వివరించి తమకు ఓటు వేసేలా వివరిస్తున్నామ'ని ఓ పార్టీ కార్యకర్త పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ WGL కాశిబుగ్గ ఏనుమాముల రోడ్ బాలాజీ సర్కిల్ దగ్గర తూర్పు ఫేస్ 146 గజములు (30 ఫీ॥ రోడ్) 30x44 గల స్థలం అమ్మబడును. Sq.yard 28K. సంప్ర॥ 7780386570. [W-1264908]

■ GWMC & KUDA అప్రూవ్డ్ లే అవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో ప్లాట్లు అమ్మబడును, కేవలం 15000/-లకు గజం మాత్రమే. వివరాలకు సంప్రదించండి. 9849992488. [W-1264855]

SERVICES

BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా! వడ్డీ చెల్లించలేకపోతున్నారా! ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787738]

WANTED

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్ 24 గం॥ వృద్ధులకు, పేషంట్లుకు, ఇంటి పని, వంట పని మరియు చిన్న పిల్లలను చూసుకోవడానికి వర్కర్లు కావలెను. సెల్: 9100116067, 9059016067. [W-1264858]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15–25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90306 12463. [M-1233892]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233895]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

జైలుకెళ్లొచ్చినా బుద్ధి మారలే..

చోరీలు చేస్తూ పోలీసులకు పట్టుబడిన నలుగురు దొంగలు

● రెండు ఆటోలు, రెండు బైక్‌లు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన డీసీపీ సీతారాం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ. పక్కన ఏసీపీ, సీఐ,ఎస్సై

జనగామ : చేస్తున్న పనిలో సంపాదన తగ్గిపోయింది. పైగా జల్సాలకు అలవాటు పడ్డారు. ఫలితంగా కుటుంబ పోషణ గడవడం భారమైంది. ఇంకేముంది సులువుగా డబ్బులు సంపాదించాలనుకున్నారు. దీనికి చోరీలే మార్గమనుకుని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా వివిధ వాహనాలు అపహరిస్తున్నారు. ఇలా ఆటోలు, బైక్‌లను చోరీ చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు డీసీపీ పి.సీతారాం తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ దామోదర్‌రెడ్డి, సీఐ రఘుపతిరెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని హైదర్షాకోట్ సన్‌సిటీ, లంగర్‌హౌజ్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్, ఫాతిమానగర్‌కు చెందిన ఫిరోజ్ అలీ ఖాన్, రాజేంద్రనగర్‌కు చెందిన ఎండీ అజహరుద్దీన్, ఎండీ బాబర్ స్నేహితులు. వీరు ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గంజాయి, మద్యానికి అలవాటుపడడంతో ఆర్థిక భారం పెరిగింది. దీంతో కుటుంబం పోషణ గడవక చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. 2022–23లో బంజారాహిల్స్, మేడిపల్లి, చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటో చోరీల కేసులో కొద్దిరోజులు చంచల్‌గూడ జైలు జీవితం గడిపారు. జైలు నుంచి విడుదలైన అనంతరం ఆటో నడుపుకుంటూ రెండోసారి కూడా అదే తరహాలో చోరీలకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా రెండు వారాల క్రితం జహీరాబాద్‌లో ఇమ్రాన్, అజహరుద్దీన్ ఒక బైక్ చోరీ చేశారు. వారం క్రితం ఇమ్రాన్, బాబర్ బీబీనగర్ ఏరియాలో మరో ద్విచక్ర వాహనం ఎత్తుకెళ్లారు. మూడు రోజుల క్రితం జనగామకు వచ్చిన నలుగురు స్నేహితులు ఆర్టీసీ బస్టాండ్ పక్కన అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఇంటి ఎదుట పార్క్ చేసిన ఆటోను ఎత్తుకెళ్లి పెంబర్తి జంక్షన్ కింగ్స్‌వే దాబా వెనుక చెట్ల పొదల్లో నిలిపారు. తిరిగి మరుసటి రోజు పెంబర్తిలో మరో ఆటోను ఎత్తుకెళ్లి అదే ప్రదేశానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాలతో పాటు రెండు ఆటోలను వరంగల్‌కు తీసుకెళ్లే క్రమంలో పెంబర్తి జంక్షన్ వద్ద పోలీసులను చూసి తప్పించుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం రూ.7.30లక్షల విలువైన రెండు ఆటోలు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ వివరించారు. కాగా, ఏసీపీ దామోదర్‌రెడ్డి, సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై భరత్, ఏఎస్ఐ శంకర్, కానిస్టేబుళ్లు కరుణాకర్, రామన్న, అనిల్ కుమార్, సాగర్, సురేశ్‌ను డీసీపీ అభినందించారు.

కోరుకొండపల్లి క్రాస్ వద్ద పోలీసుల తనిఖీలు

● రూ.1.60 లక్షల నగదు పట్టివేత

కేసముద్రం : మండలంలోని కోరుకొండపల్లి క్రాస్ చెక్ పోస్ట్ వద్ద మంగళవారం కారులో తరలిస్తున్న రూ.1.60 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. వరంగల్‌కు చెందిన శ్రీతాన్.. కేసముద్రం నుంచి వరంగల్ వైపునకు కారులో వెళ్తున్నాడు. చెక్ పోస్ట్ వద్ద పోలీసులు కారును తనిఖీ చేయగా రూ. 1.60 లక్షలు లభ్యమయ్యాయి. ఈ నగదుకు ఆధారం చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

● కాంటిజెంట్‌లీడర్‌గా ప్రవీణ్‌కుమార్



ప్రవీణ్‌కుమార్

కేయూ క్యాంపస్ : కర్ణాటకలోని జనపద లోక రామనగర ప్రాంతంలో ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ సమైక్యతా శిబిరానికి తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా కేయూ జాతీయ సేవాపథకం నుంచి హనుమకొండలోని ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్ ప్రవీణ్‌కుమార్ కాంటిజెంట్‌లీడర్‌గా వ్యవహరించబోతున్నారు. ఈ శిబిరానికి తెలంగాణ నుంచి కేయూ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి పది మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కూడా ఎంపికయ్యారు. వీరు కూడా జాతీయ సమైక్యతా శిబిరంలోభాగస్వాములుకాబోతున్నారు. వీరికి ప్రవీణ్‌కుమార్ కాంటిజెంట్‌లీడర్‌గా వ్యవహరించబోతున్నారు. కాగా, కేయూ ఎన్ఎస్ఎస్‌కోఆర్డినేటర్ ఈసం నారాయణ వీరిని అభినందించారు.

ఎంపికైన వారు..

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన కేయూ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. బి మనోజా టీటీడబ్ల్యూ (ఆర్‌డీసీ ఉమెన్ మహబూబాబాద్), బి ఇందుప్రియ(ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్, ఖమ్మం),రోషిని (కిట్స్,హనుమకొండ),పి మనస్విత (యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీ హనుమకొండ), జె హర్షిత యూనివర్సిటీ ఇంజనీరింగ్ మహిళా కళాశాల(కేయూ), సీహెచ్ శివశంకర్ (ఎల్‌బీ కాలేజీ ,వరంగల్), జి రాజు(టీటీడబ్ల్యూ ఆర్‌డీసీ బాయ్స్ మణుగూరు), బి సూర్యకాంత్ (ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సైన్స్‌స్, ఆదిలాబాద్) జె మహేష్ (వాగ్దేవి డిగ్రీ అండ్‌పీజీ కాలేజీ , హనుమకొండ), జి దిలీప్‌కుమార్ (కేయూ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్‌టెక్నాలజీ) ఉన్నారు.

సీపీఐ (మావోయిస్టు) పార్టీ సభ్యురాలి లొంగుబాటు



ఇమాంబీకి చెక్కు అందజేస్తున్న ఎస్పీ. పక్కన అడిషనల్ ఎస్పీ చెన్నయ్య

మహబూబాబాద్ రూరల్ : సీపీఐ (మావోయిస్టు) పార్టీ సభ్యురాలు షేక్ ఇమాంబీ అలియాస్ టైలర్ జ్యోతక్క అలియాస్ లక్ష్మి అలియాస్ రాధక్క అలియాస్ సాంబలక్ష్మి మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వరంగల్ జిల్లా మండలం బుధరావుపేట శివారు మనుబోతులగడ్డ ప్రాంతానికి చెందిన షేక్ ఇమాంబీ సీపీఐ(మావోయిస్టు) పార్టీ సిద్ధాంతాలకు ప్రభావితమై 2004లో ఛత్తీస్‌గఢ్ వెళ్లిందన్నారు. అక్కడ పార్టీ టైలరింగ్ టీమ్‌లో చేరి పని చేస్తోందన్నారు. ఈ క్రమంలో మావోయిస్టు భావజాలంపై కొంతకాలంగా విసుగు చెంది మంగళవారం లొంగిపోయిందని ఎస్పీ పేర్కొన్నారు. మావోయిస్టులు తమ వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం ప్రజలను ప్రభావితం చేసి దోపిడీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారంతా జనజీవన స్రవంతిలో కలవాలన్నారు. ఈ సందర్భంగా ఇమాంబీకి పునరావాసం చెక్కు అందించారు.